క్లుప్తంగా

పోలేరమ్మకు విశేష పూజలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో పోలేరమ్మకు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామ పెదకాపు మెట్టుకూరు పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం మహిళా భక్తులు అమ్మవారికి చద్ది సమర్పించి మొక్కుకున్నారు. దసరాకు ముందు 21 రోజుల పాటు పోలేరమ్మకు విశేష పూజలు నిర్వహించి చద్ది సమర్పించనున్న గ్రామస్తులు తెలిపారు. ఆఖరి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పొంగళ్లు నిర్వహించనున్నట్లు వివరించారు.

పీఎండీఎస్ కిట్ల పంపిణీ



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పీఎండీఎస్ కిట్లను వ్యవసాయాధికారులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పంటలకు పోషకాలు అందించేందుకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు దోహదపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పీటీ వెంకటలక్ష్మి, వీఏఏ నితీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



అనుమసముద్రంపేట: ఆత్మకూరులోని గురుకుల పాఠశాలలో విషజ్వరాలు ప్రబలిన నేపథ్యంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఏఎస్‌పేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సోమవారం సందర్శించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. వసతి, వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

భక్తిశ్రద్ధలతో రొట్టెల ఉత్సవం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో రుమాలాల ఉత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ఖాజానాయబ్ రసూల్ వారి గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. గంధోత్సవానికి ముందుగా దర్గాపైనున్న చంద్రవంకను శుభ్రం చేసి పూలమాలలతో అలంకరించే రుమాలాల ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో మహల్ నుంచి పకీరుల జరాబులు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా పూలమాలలను తీసుకొచ్చి దర్గాపైనున్న చంద్రవంకను శుభ్రం చేసి పూలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో దర్గా ఈఓ హుస్సేన్ పాల్గొన్నారు.

ఘనంగా శరత్‌చంద్ర చటోపాధ్యాయ జయంతి



కావలి(అల్లూరు): ప్రముఖ నవలా రచయిత శరత్‌చంద్ర చటోపాధ్యాయ జయంతిని కావలిలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. శరత్‌చంద్ర చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి బొమ్మల కోటేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరత్‌చంద్ర జీవిత విశేషాలు, రచన శైలిని వివరించారు.

ప్రతిభా పోటీలు

ఉదయగిరి రూరల్: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు హెచ్‌ఎం జీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో క్విజ్‌తో పాటు స్పెల్‌బీ పోటీలను సోమవారం నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయిని ప్రశాంతికుమారి పాల్గొన్నారు.

గ్రావెల్ దోపిడీ

- చెలరేగిపోతున్న మాఫియా
- చెరువుల్లో అనుమతుల్లేకుండా తవ్వకాలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- మామూళ్ల మత్తులో పోలీసులు



వింజమూరులోని యర్రబల్లిపాళెం చెరువు నుంచి గ్రావెల్ తరలింపు

ఉదయగిరి : ఉదయగిరి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. చెరువుల నుంచి అనుమతి లేకుండా రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. దీనిని క్షేత్రస్థాయిలో అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో నో...అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఫిర్యాదులొచ్చినా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రభుత్వానికి రాయిల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

చెరువులను చెరపడుతూ..

వింజమూరు, కలిగిరి, ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లోని చెరువుల నుంచి మట్టి,గ్రావెల్‌ను అక్రమార్కులు దోపిడీ చేస్తున్నారు. ఈ తంతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగిపోయింది. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతుండగా, మరికొన్నిచోట్ల ఇరిగేషన్, పోలీసు అధికారుల ప్రమేయంతో దోపిడీ జరుగుతోంది. వింజమూరులోని యర్రబల్లిపాళెం చెరువు నుంచి నిత్యం జేసీబీలు, ప్రొక్లయిన్లు, టిప్పర్లు, ట్రాక్టర్లును ఉపయోగించి గ్రావెల్‌ను దోచేస్తున్నారు. నామ మాత్రంగా అనుమతులు తీసుకుని పెద్ద మొత్తంలో గ్రావెల్‌ను తరలిస్తున్నారు. అనుమతులు తీసుకున్న వారు కూడా నిబంధనలు పాటించడం లేదు. ఎక్కడ పడితే అక్కడ పెద్ద ఎత్తున గోతులు తీసి మట్టి,,గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇటీవల యర్రబల్లిపాళెం చెరువు నుంచి ఓ టిప్పర్ యజమాని అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తుండగా అధికార పార్టీకి చెందిన ఓ నేత అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా పోలీసు అ. ధికారి అండ ఉండడంతో సదరు టిప్పర్ యజమాని లెక్క పెట్టలేదు. దీంతో సదరు నేత ఈ వ్యవహారంపై సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి పేరుతో కాంట్రాక్టర్ అనుమతులు తీసుకుని చెరువుల నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. 1.5 మీటర్ల లోతు మేర మాత్రమే తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నా రెండు,మూడు మీటర్ల లోతు గోతులు తీసి తరలిస్తున్నారు. వింజమూరు, కలిగిరి చెరువుల్లో ఈ తంతు కొనసాగుతోంది. జాతీయ రహదారి కోసం మూడేళ్ల క్రితం అనుమతులు తీసుకుని నిరంతరం కొనసాగిస్తున్నారు. ఎంత మేరకు అనుమతులు తీసుకున్నారు.. ఎంత తరలించారు..అనే విషయం అధికారులు లెక్క తీయలేదు.దీని వెనుక ఇరిగేషన్ అధికారుల ఉదాసీనత ఉన్నదనే విమర్శలు వస్తున్నాయి.

అడ్డుకునే దమ్ముందా..

అక్రమార్కులు ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి తరలిస్తున్నా అధికారులు మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. అధికార పార్టీ నేతల ప్రమేయంతో లేఅవుట్ల కోసం మట్టి తరలిస్తున్నారు. ఎమ్మెల్యే కాకర్ల మట్టి , గ్రావల్ అక్రమ తవ్వకాలను కట్టడి చేయాలని పైకి చెబుతున్నా.. వాస్తవంగా అమలుకు నోచుకోవడం లేదు. పోలీసులు, ఇరిగేషన్ అధికారులు మామూళ్ల తీసుకుని మట్టి, గ్రావెల్ తరలింపుకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా మట్టి ,గ్రావెల్ అక్రమంగా తరలిస్తుంటే తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్, పోలీసులు అధికారులు చెబుతున్నారు. అయితే ఎవరైనా సమాచారం ఇస్తే మాత్రం సిబ్బంది లేరని చెబుతున్నారు. మరోవైపు అక్రమార్కులకు సమాచారం ఇచ్చి రెండు, మూడురోజులు ఆపుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



డిప్యూటీ ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

దుత్తలూరు: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ దుత్తలూరు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సచివాలయ ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఆరేళ్ల పాటు ఒకే కేడర్లో పనిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. రికార్డ్ అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేయాలన్నారు. ఇంటింటి సర్వేలతో అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వెంటనే తమను మాతృ శాఖలకు బదిలీ చేయాలన్నారు. సమయపాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌ల పేరిట పండగలు, సెలవు దినాల్లో బలవంతపు విధులు చేయించడం ఆపాలన్నారు.

దస్తావేజు లేఖర్ల నిరసన



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

ఉదయగిరి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు ఓటీపీ, ఆటో మ్యూటేషన్‌కు సంబంధించి రూపొందించిన సాఫ్ట్‌వేర్ లోపభూయిష్టంగా ఉందన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒకసారి ఓటీపీ నమోదు చేస్తే సరిపోయేదన్నారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ చేసే ప్రతిసారి ఓటీపీ నమోదు చేయాల్సి వస్తుందన్నారు. ఫలితంగా తమతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లోని లోపాలను సరిచేసి ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ మెల్కిరోషన్‌కు వినతి పత్రం అందజేశారు.

రైతుసేవా కేంద్రం ఎదుట రైతుల ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఉదయగిరి రూరల్: బండగానిపల్లె రెవెన్యూ పరిధిలో చేపట్టిన భూముల రీసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ బిజ్జంపల్లి రైతు సేవా కేంద్రం ఎదుట సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూముల రీసర్వేను అధికారులు ఇష్టానుసారంగా చేపట్టడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరికి సంబంధించిన పొలాన్ని మరొకరి పేరుపై నమోదు చేయడం , ఒకరి ఆధార్‌కార్డులను మరికొరి పొలానికి అనుసంధానం చేయడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగిన తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రీసర్వేలోని లోపాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



జలదంకి (కలిగిరి): మద్యం బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నవరం, చిన్నక్రాక గ్రామాలకు చెందిన దళిత యువకులు కోరారు. సోమవారం వారు జలదంకిలో విలేకరులతో మాట్లాడారు. బెల్టు దుకాణాల్లో అక్రమంగా అధిక ధరలకు మద్యం అమ్మకాలు జరుపుతూ పేద ప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. లైసెన్సులు కలిగిన మద్యం దుకాణాల నిర్వాహకులే ప్రత్యేక వాహనాల్లో బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు బెల్టుషాపులను కట్టడి చేయకపోతే రోడ్లపైకి వచ్చి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వట్టికాయల గిరిబాబు, వట్టికాయల చంద్రయ్య, వీ ఏడుకొండలు, నేలపాటి మల్లేశ్వరరావు, గంధం ప్రమోద్‌కుమార్, వట్టికాయల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు



రెవెన్యూ కోర్టులో ఇరువర్గాల వాదనలు వింటున్న ఆర్డీఓ పావని

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ బీ పావని ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కోర్టు నిర్వహించారు. కలువాయి, చేజర్ల, మర్రిపాడు, తదితర మండలాలకు చెందిన వారి భూసమస్యలపై ఇరువర్గాల వాదనలను ఆర్డీఓ విన్నారు. వారి వద్ద ఉన్న ఆధారాలను తీసుకుని నమోదు చేసుకున్నారు. కాగా రెవెన్యూ కోర్టులో నాలుగు సమస్యలను పరిష్కరించినట్లు ఆర్డీఓ తెలిపారు. అంతకుముందు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఆత్మకూరు డివిజన్ పరిధిలో నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను ఆర్డీఓ స్వీకరించారు. వివిధ సమస్యలపై 15 అర్జీలు అందగా, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని వాటి నిర్వాహకులను ఆదేశించారు.

బ్రాహ్మణక్రాక పాఠశాల పరిశీలన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అధ్యాపకురాలు ఎం పద్మజ

జలదంకి (కలిగిరి): జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పల్లిపాడు డైట్ కళాశాల అధ్యాపకురాలు ఎం పద్మజ సోమవారం సందర్శించారు. అకడమిక్ మానిటరింగ్‌లో భాగంగా ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆమె వెంట హెచ్‌ఎం శ్రీరాంప్రసాద్ ఉన్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి



ఆర్డీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఉపాధి కూలీలు

కావలి(అల్లూరు): ఉపాధి కూలీలకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ మాల్యాద్రి కోరారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఏడాదికి రెండు వందల రోజులు పని కల్పించాలన్నారు. దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని, వారం వారం నగదు చెల్లించేలా చూడాలని కోరారు. రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడండి



మున్సిపల్ ఆర్‌ఐ షాజహాన్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సీజనల్ వ్యాధుల బారినుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఐ షేక్ షాజహాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వాతావరణ పరిస్థితులు మారడంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లడం, దోమల నివారణ మందు పిచికారి చేయించి విషజ్వరాలను అరికట్టాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జంగం నాగరాజు, బెల్లం కొండ హజరత్తయ్య, అంకమ్మ, రమణయ్య, ఎస్ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు వైద్యవిద్యార్థికి గోల్డ్‌మెడల్



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లికి చెందిన పీ విరాజిత ఎండీ జనరల్ మెడిసిన్‌లో ప్రతిభకనబరిచి బంగారు పతకం సాధించింది. వెంకట్రావుపల్లికి చెందిన ఉపాధ్యాయులు రాఘవరెడ్డి దంపతుల కుమార్తె విరాజిత భువనేశ్వర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. అనంతరం కడపలోని రిమ్స్‌లో ఎండీ జనరల్ మెడిసిన్‌ను పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కడపలోని రిమ్స్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి జనరల్ మెడిసిన్ వైద్యుల 53వ సదస్సులో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ పీ చంద్రశేఖర్ బంగారు పతకాన్ని అందజేసి అభినందించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.330

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 444 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 879 బేళ్లు రాగా, 444 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.330, కనిష్టంగా రూ.100, సగటున రూ.192.29 ధర పలికిందని వివరించారు.

677 పొగాకు బేళ్ల విక్రయం

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.330 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 677 బేళ్లను తీసుకురాగా, 541 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకుకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ.100, సగటున రూ.206.48 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

రేపటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు

ఉదయగిరిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏపీ స్కూల్ గేమ్స్–2025 మండల స్థాయి ఎంపికలు బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ–1 టీ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ ప్రసాద్ సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. అండర్– 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా, చెస్, తదితర పోటీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు లీప్‌యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63007 46554 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18, 19 తేదీల్లో మండల స్థాయి స్కూల్‌గేమ్స్‌ను నిర్వహించనున్నట్లు ఎంఈఓ అనంత లక్ష్మిరెడ్డి సోమవారం తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, యోగా, అథ్లెటిక్స్, తదితర పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

మంచంపట్టిన కొల్లపనాయుడుపల్లి

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలంలోని కొల్లపనాయుడుపల్లి మంచంపట్టింది. వాతావరణంలోని మార్పులతో విషజ్వరాలు వ్యాప్తి చెందడంతో ప్రజలు అల్లాడుతున్నారు. ప్రతిఇంట్లో ఒకరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. మండల వైద్యశాఖ అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

జలదంకి (కలిగిరి): జలదంకికి చెందిన నిరుపేద ట్రాక్టర్ డ్రైవర్ శ్రీవర్ధన్ కుటుంబానికి జనసేన నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో శ్రీవర్ధన్ మృత్యువాత పడ్డాడు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేలు నగదును అందజేశారు.

గాంధీ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



సీతారామపురం : మండల కార్యాలయాల ప్రాంగణంలో మహాత్మా గాంధీ కాంస్య విగ్రహ ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారెడ్డి పీఆర్ ఏఈ చిన్నయ్యతో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. త్వరలో మండల పరిషత్ నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సుబ్బారెడ్డి తెలిపారు. నాయకులు బీ మాబయ్య, బ్రహ్మయ్య, నవీన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



కావలిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



ఉదయగిరిలో ..

ఉదయగిరి: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయగిరి తాలూకా పరిధిలోని ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ హజరత్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి తాత్కాలిక భృతి వెంటనే ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతపత్రం ఇవ్వబోగా తీసుకోకపోవడంతో నోటీస్ బోర్డుకు తగిలించారు. జిల్లా నాయకులు మాల్యాద్రి, శ్రీనివాస రాజు, ఖాజా, వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు ఖాదర్‌బాషా , సీతారాంపురం నాయకులు సురేష్‌బాబు వెంకటేశ్వర్లు హుస్సేన్ , వరికుంటపాడు నాయకులు జీలాని, బాలకృష్ణా, రమేష్ దుత్తలూరు నాయకులు మాధవ రాజు, రమణారెడ్డి, ఖాజారసూల్ ఉదయగిరి నాయకులు షబ్బీర్, ఓబులేసు, అజీజ్, రామకృష్ణారెడ్డి, రజాక్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి

కావలి(అల్లూరు): ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కావలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులకు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణయ్య, కావలి మండలాధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి మధు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో తనిఖీలు



వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్

మర్రిపాడు: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వసతిగృహాలను తహసీల్దార్ అనిల్ కుమార్‌యాదవ్, ఎంఈఓ– 2 ధనలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. నందవరంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహం, మర్రిపాడులోని బాల, బాలికల వసతిగృహాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయ వసతిగృహం, కంపసముద్రంలోని వసతిగృహాలను సందర్శించారు. కొన్ని వసతిగృహాల్లో సంక్షేమాధికారులు లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యార్థుల వసతి, వంట గదుల్లో పారిశుధ్యాన్ని పరిశీలించారు. మర్రిపాడు బాలుర వసతి గృహంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో తహసీల్దార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బాలుర వసతిగృహం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినట్లుగా గుర్తించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

శాశ్వత భవన వసతి కల్పించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న బీసీ ఐక్యత భవన్ సభ్యులు

కావలి(అల్లూరు): కావలిలోని బీసీ కళాశాల బాలుర వసతిగృహానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్రాధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. 2013లో ప్రభుత్వం కావలిలో కళాశాల బీసీ విద్యార్థుల కోసం అద్దె భవనంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. అప్పట్నుంచి అద్దె భవనంలోనే వసతిగృహాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత భవనాన్ని నిర్మించాలని కోరారు.

కొనసాగుతున్న తెలుగుతమ్ముళ్ల నడుమ వివాదం

అనుమసముద్రంపేట: మండలంలోని చాటభీమవరంలో సీసీరోడ్డు నిర్మాణం విషయంలో తెలుగు తమ్ముళ్ల మధ్యన నెలకొన్న వివాదం కొనసాగుతోంది. రెండ్రోజుల క్రితం గ్రామంలోని ఓ వర్గానికి చెందిన పద్మమ్మ స్థలంలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు మరోవర్గానికి చెందిన సర్పంచ్ లక్ష్మీనరసయ్య ప్రయత్నించగా ఆమె అడ్డుకుని కంపవేసింది. దానిని సర్పంచ్ తొలగించగా ఆమె రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పరిశీలించి సదరు స్థలంలో మార్గం లేనందున సీసీరోడ్డు చేపట్టడానికి వీల్లేదని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సర్పంచ్ గ్రామస్తులను రెచ్చగొట్టి పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. సీసీరోడ్డును అడ్డుకున్న పద్మమ్మను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి ఎస్సై సైదులు సామరస్యంగా నచ్చజెప్పి వెనక్కిపంపించారు. కాగా ఎస్సై సైదులు తనను స్టేషన్‌కు పిలిపించి నానా దుర్భాషలాడారని సర్పంచ్ లక్ష్మీ నరసయ్య ఆరోపించారు.